# అమ్మకడుపు చల్లగా అత్తకడుపు చల్లగా

ఎక్కడ సినిమాలు ఫ్రీయో
ఏ వీధిలో కాఫీ హోటళ్లూ, కిల్లీకొట్లూ తెల్లార్లూ తెరిచే వుంటాయో
ఏ కొట్లో ప్రతివస్తువూ అరువుదొరుకుతుందో
రెండు చేతులా అప్పుచేసినా మనుష్యులు ఎక్కడ నిర్భయంగా తలెత్తుకుని తిరగగలుగుతారో
ఎక్కడ చదువుకోకుండా
తెలివి తక్కువ వాళ్ళకు పెద్ద పెద్ద ఉద్యోగాలు లభిస్తాయో
ఎక్కడ పంపు వుండి కరెంటుఖర్చు లేకుండా అడ్వాన్స్ వినా అద్దె తక్కువకి దొరుకుతాయో
ఇళ్ళు ఆ ఊరికి; భగవాన్
ఇప్పుడే ఈ క్షణమే
మా వార్ని ట్రాన్స్‌ఫర్ చెయ్యి;
(తరువాత)
ఎక్కడ ఆచారాలూ
అత్తగార్ల సాధింపులూ
ఆడబిడ్డ గొణుగుళ్ళూవుండవో
ఎక్కడ మొగుడితో షికార్లకులేచిపోయినా
ఆడముండలు బుగ్గలు నొక్కుకోరో
ఎక్కడ అందంగా వుండకూడని పనిమనిషి
అంట్ల గిన్నెలు అందంగా తోముతుందో
ఎక్కడ శుక్రవారంనాడు
శుభ్రంగా తలంటోసుకుని
మడికట్టుకొని బుద్ధిగా మాలక్ష్మి పీటదగ్గర పూజ చేసుకుంటూంటే
మొగుడువచ్చి ముద్దు పెట్టుకున్నా తప్పులేదో
తండ్రీ ఆ స్వర్గానికి
నన్నూ మా వార్నీ లేవదీసుకొని పో;
(బైదిబై)
కళ్ళకు కాటుక పెట్టుకొనీ
నుదుటన్ తిలకం దిద్దుకొనీ
గుండెకు పుస్తకాల్ హత్తుకొనీ...
కాలేజి మెట్లమీద జీరాడే కుచ్చెళ్ళు

కుర్రవాళ్ళ గుండెలకు సరిగా
అంపపు కోత కాగా -
పొట్టి రవికలు తొడుగుకొని
పొట్ట కనిపించేలా పవిటేసుకుని
కళ్ళముందు నడయాడే కన్నె పిల్లలు
చిన్నారి చిలిపికళ్ళ జయలలితలూ
పొన్నారి పొడుగుకాళ్ళ వైజయంతీమాలలూ
ముద్దులు మూటకట్టే
కృష్ణకుమారి, సుకన్య, రాజశ్రీ.
కాంచన, విజయలలితలూ
ముద్దులు మూటకట్టని గీతాంజలి,
గిరిజ, చిన్నసైజు సూరేకాంతాలూ -
యువక హృదయాలను పిండి ఎండ
వేసే జమునలూ - సావిత్రులూ
వీళ్ళందర్నీ పోలిన ఈ పెళ్ళి కూతుళ్ళని
స్వేచ్ఛగా కానీ కట్నం లేకుండా పెళ్ళికొడుకులు దొరికేచోటికి
ఓ భగవంతుడా
లేవదీసుకు ఫో;

నే వ్రాసిన ఈ వచన కవితను డస్కుబల్లమీద చూసి మా వారు నేలకేసికొట్టి - ఫూలిష్ ట్రాష్, నాన్సెన్స్ అని గొణుక్కున్నారు.

టాగూర్నో మరెవర్నో చూసి కాపీ కొట్టానట.

చంద్రుడ్ని తిట్టి, సూర్యుడ్ని పొగిడి, నక్షత్రాలకు వార్నింగు ఇచ్చారు.

వెన్నెలను దూషించి, వర్షాన్ని మెచ్చుకున్నారు.

పప్పులో పచ్చి మిరపకాయలూ,

పచ్చడిలో వుల్లి పాయలూ కొరక నన్నారు.

అప్పడాలపిండి తినను -

పచ్చి ఒడియాలు వేయించక్కర్లేదన్నారు.

కందిపచ్చడి కూడా చేయద్దన్నారు.

పోనీ - తలంటోసుకోండి రండన్నాను.

ఎవరూ అచ్చువేయని సీరియల్ నవలలా వుందిగదా - జుట్టు బాగా పెరిగిపోయింది. షాపు కెళ్ళిరండి - వేడ్నీళ్ళు కాచి, కుంకుడు కాయలు కొట్టి సిద్ధంగా వుంచుతాను అన్నాను.

డామిట్, ఇడియట్; రాస్కెల్ అని తిట్టారు.

నాసర్ తెలీక ఇజ్రాయెలుమీద కయ్యానికి కాలు దువ్వినట్లు నా మీదకు దండెత్తి వస్తున్నారు. జాగ్రత్త; అన్నాను.

ఇంట్లోంచి మెడపట్టుకు గెంటుతానన్నారు రుసరుసలతో విసవిసలతో పొగలు సెగలు గ్రక్కుతున్నారు.

తలంటోసుకుంటారా లేదా - మీ అమ్మగారు రైలెక్కుతూ మావాడికి వారం వారం తలంటొయ్యే తల్లి బద్ధకించక, అని మీ తల నా కప్ప చెప్పారు. అది అప్పుడే ఓవర్‌డ్యూ.... అని అల్టిమేటం ఇచ్చాను.

తలంటంటె మా వారికి గొప్ప ఎలర్జీ - ప్రతి ఆడదీ తన మొగుడికి వారం వారం తనే తలంటాలి. అంటే వారాని కోసారి తన తలను మన స్వాధీనంలోకి తెచ్చుకోవచ్చు అన్నమాట. ముందు నూనె బాగా రాసుకోమనాలి అది యింకేదాకా దొడ్లోతువ్వాలు చుట్టుకుని తిరగమనాలి. ఈ కార్యక్రమం ఆదివారాల్లోనూ, సెలవరోజుల్లోనూ ప్రారంభిస్తే మొగుడికి మొగుడు స్నేహితులకీ బుద్ధిచెప్పినట్లవుతుంది. పేకాటకి తలంటు విరుగుడు.

తలంటుకి పిల్చి నూనె రాసుకోమని పొయ్యిదగ్గర కూర్చుని వారపత్రిక చదువుకోవాలి. తలగొట్టి చిన్న కంచు గ్లాసుడు పంచదార అప్పుకోసం వచ్చిన పిన్నిగారితో వాకిట్లో బాతాఖాని వేసినా తప్పు లేదు. ఒక మాటు నూనె రాసుకున్న తరువాత పులుసు పోసి నీళ్ళు తోడిచ్చి వీపురుద్ది మళ్ళీ అవతారమూర్తిని యింట్లోకి తీసుకురావడానికి ఇల్లాలు ఎంత టైమయినా తీసుకోవచ్చు. కళ్ళలో పులుసు పోసిన కోపం వీపురుద్దేటప్పుడు గాజుల గలగలలకు పోతుంది. కళ్ళు మూసుకోండి అని నెత్తిమీద పులుసు గిన్నె పెట్టి షికారుకి వెళ్ళినా తప్పులేదు. "తారాశశాకం" లో తారచంద్రుడికి తలంటుతుంది.

అసలు మొగుడికి తలంటడం పెళ్ళాం జన్మ హక్కు; ఇప్పుడు పియ్యూసిలు, బియస్సీలు చదివిన అమ్మాయిలు మొగుళ్ళకు తలలంటు తున్నారో లేదో నాకు తెలియదు కాని - అది చాలగమ్మత్తయిన సరదా! తలంటు ప్రారంభించాక మధ్యలో నీరసం రాకుండా కనీసం కాఫీ యేనా ఇవ్వడం మన కనీస ధర్మం; సిగరెట్ కాల్చుకోనివ్వచ్చు -

అలా తలంటు సమయంలో ఏవేవో కబుర్లు చెప్పుకోవచ్చు. బజారుకి షాపింగ్ కెళ్ళడం సినిమాల లాంటివి ఫిక్సు చేయచ్చు.

క్షణం వెనుక క్షణం అలా గడిచి పోతూనే వుంటుంది. కాలం మన కోసం అడుగు వెనక్కు జరగదు కదా కొంతమంది సెలవు రోజుల్లోనే చిరునవ్వులు నవ్వాలను కుంటారు.

ప్రతి నిముషాన్ని ఉత్సాహంతో నింపి సరదాగా రోజుల్ని ఎందుకు గడిపేయ కూడదు?

మూడు యాభైలు ఎవరూ బ్రతికేది లేదు కదా? అందుకే -

ఆనందం అర్ణవమైతే
అనురాగం అంబరమైతే
ఆనందపు లోతులు తీస్తాం

అనురాగ పుటంచులు చూస్తాం

రండి; ఇదిగో నూనె గిన్నె అదుగో తువ్వాలు - ఆ తువ్వాలు చుట్టుకుని ఈ నూనె వంటికిరాసు కోండి; ఏదీ తలెత్తండి - నెత్తిమీద -

మీ అమ్మ కడుపు చల్లగా

మీ అత్తకడుపు చల్లగా -

# బొమ్మలు బొమ్మలు బొమ్మలు

బొమ్మలకొలువు ఎప్పుడొస్తుందా అని ఆ బొమ్మల పెట్టికేసి ఎంత ఆశగాచూసేవాళ్ళం; ఆఖరికి ఓ రోజు -

మా అమ్మ గడపవతల తలుపు దగ్గర నిలబడి పిల్లలు దసరాకు బొమ్మలు పెట్టుకోవాలను కుంటున్నారండీ అని చెప్పేది.

అంత చల్లగా, తీయగా మాట్లాడే అమ్మమాటలు నాన్న కెందుకో అంత చల్లగా తీయగా వినిపించేవి కావు.

ఆ బొమ్మలన్నీ పెట్టెలోంచి తీసి మా అమ్మ నేలమీద పరిచేది.

కష్టపడి డబ్బులు మిగిల్చి మానాన్నకు తెలియకుండా ఒకొక్క బొమ్మా తను ఎలా కొన్నదీ మా అమ్మచెబుతోంటే మా నాన్నగారి మీద చెడ్డకోపం వచ్చేది మాకు.

మేం విరగ కొట్టేస్తావేమోనని. కన్నతల్లి ప్రేమలా వెన్నెలలా అమృతం కురిపించే కళ్ళతో మా కేసి బొమ్మలకేసి మార్చి మార్చి చూస్తూ ఆ బొమ్మలను పొందికగా పట్టుకుని గుండెలకు హత్తుకుని నెమ్మదిగా తుడిచేది.

విరిగిన ముక్కులు. చేతులు, కాళ్లుసర్వీసు పెట్టి అతికించి కుంచె తీసుకుని తన మనసులోని రంగులన్నీ పులిమేది.

ఆ దసరా బొమ్మల కొలువు ఎంత చిత్తాకర్షకంగా వుండేది?

పది తలల రావణాసురుడు.

ముందు తోకను చుట్ట పెట్టుకుని ఎత్తునకూర్చున్న హనుమంతుడు పారాడే కృష్ణుడు శిఖిపింఛమువాగ్గు

గట్టుమీగ కూర్చుని వీణవాయించుగుంటున్న సరస్వతి. తామరపూవులో ఒక కాలుకాస్త వంచి అభయహస్తమిస్తూ వయ్యారంగానిల్చున్న లక్ష్మీదేవి;

చారల పులిమీద భయంలేకుండా కూర్చున్న దుర్గాభవాని - శేషశాయి, పాముమీదపడుకున్న